
సాక్షి
వికారాబాద్

సోమవారం : 29 : జూలై : 2024



పాముకాటుతో భద్రం

వర్షాకాలం పాటుకాటు కలవరపెడుతోంది. పంట పొలాల్లో చమటోడ్చే రైతులకు ప్రాణ సంకటంగా మారింది. 10లో▸



మరమ్మతులు మరిచి..

పదేళ్లుగా మరమ్మతులు చేపట్టక రోడ్లన్నీ పూర్తిగా ఛిద్రమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. 10లో▸



బోనమెత్తిన పల్లెలు

ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తులు గ్రామ దేవతలకు ఆదివారం బోనం ఎత్తారు. 11లో▸

న్యూస్‌రీల్

మన్నెగూడ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సయ్యద్ ఆదిల్

పూడూరు: సామాజిక సేవలందిస్తున్న ఆదిల్ గ్రూపు చైర్మన్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. పీపుల్స్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్ వారు ఢిల్లీలోని శ్రీసత్యసాయి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక, ఆర్థిక సేవలు అందిస్తున్న మన్నెగూడ వాసి సయ్యద్ ఆదిల్‌కు విశిష్ట సామాజిక సేవల్లో డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా ఆదిల్ మాట్లాడుతూ.. తన సేవలు గుర్తించి డాక్టరేట్ అందించిన గ్లోబల్ పీస్ వర్సిటీ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ డాక్టరేట్‌తో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.

ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎవరూ విశ్వసించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి నెలలు తిరగకముందే మాట మార్చారని విమర్శించారు. నిబంధనలు తుంగలో తొక్కి భూములు సేకరించారని ఆరోపించారు. కలెక్టర్‌ను ఫార్మా పరిధిలోని భూముల్లో పరిశీలనకు పంపడం ద్వారా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫార్మా రద్దు చేస్తామని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోదండ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సంఘటితంగా ఉంటేనే గుర్తింపు

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



చల్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కోదండరాం తదితరులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఉద్యమకారులు సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వం వేగంగా గుర్తింపునిస్తుందని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్‌గా కీలకపాత్ర పోషించిన వెదిరె చల్మారెడ్డి ప్రథమ వర్ధంతి సభను ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఆ నాటి పలువురు ఉద్యమకారులు హాజరై చల్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. మన వెన్నంటి నడిచినవాళ్లను ఎప్పటికీ మరిచిపోవద్దని, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకునేందుకు చల్మారెడ్డి చేసిన పోరాటం మరవలేమన్నారు. తెలంగాణ ఉద్యమం ఒక వ్యక్తి చరిత్ర కాదని, ఉమ్మడి చరిత్ర అని గ్రహించాలన్నారు. అందరి పోరాట ఫలితంగానే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ పోరాటాన్ని పుస్తకరూపంలో తీసుకువచ్చినప్పుడే మనమంతా చరిత్రలో నిలిచిపోతామన్నారు. అందుకు ప్రతి ఉద్యమకారుడు కృషి చేయాలని, అందులో తన వంతు సహాయ సహకారాలుంటాయన్నారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణలో రంగారెడ్డి జిల్లాకు న్యాయం జరుగుతుందని భావిస్తే.. జిల్లా అస్తిత్వమే లేకుండా చేశారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు, రియల్ వ్యాపారులకు ఉపయోగపడిందే తప్ప ఈ ప్రాంతవాసులకు ఉపయోగపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు జిల్లాకు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లా ఆస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దివంగత చల్మారెడ్డి సతీమణి సువర్ణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ఉద్యమకారులు అశోక్‌కుమార్, విక్టర్, వంగేటి లక్ష్మారెడ్డి, శివకుమార్, రాచర్ల వెంకటేశ్, బర్ల జగదీశ్‌యాదవ్, కావలి నర్సింహ, మడుపు వేణుగోపాల్‌రావు, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జంగయ్య, ఎండీ గౌస్, సతీష్, జంగయ్య, రవీందర్, అంజయ్య, రమేష్, నిరంజన్ పాల్గొన్నారు.

మన్నెగూడ-అప్పా జంక్షన్ రహదారి



స్లో.. వే

పనులు ప్రారంభించకుండానే ముగిసిన గడువు

- నత్తనడకన 163వ జాతీయ రహదారి పనులు
- 46 కిలోమీటర్లకు రూ.956 కోట్లతో టెండర్
- ఏళ్లు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- ప్రమాదాలతో రక్తసిక్తమవుతున్న రహదారి
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

వికారాబాద్: మన్నెగూడ నుంచి హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీ వరకు చేపట్టనున్న నాలుగు లేన్ల రహదారిపై జిల్లా వాసులకు ఆశలు నీరుగారుతున్నాయి. ఈ రోడ్డు విషయంలో జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల ప్రజలతో పాటు చేవెళ్ల నియోజకవర్గ ప్రజలు సైతం తీవ్ర వ్యధకు గురవుతున్నారు. అయితే ముఖ్యమంత్రిగా జిల్లా వాసి అయిన కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అవ్వడంతో తొలుత ఆశలు చిగురించాయి. ఆరు నెలలు గడిచినా ఏ కదలిక లేకపోవటంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఈ రహదారికి సంబంధించి కేంద్రం ఇప్పటికే నిధులు కేటాయించటంతో పాటు టెండర్లు సైతం పిలిచింది. రోడ్డు నిర్మాణ పనుల బాధ్యత కేంద్రం చూస్తుండగా భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం చూడాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రోడ్ల విస్తరణ పనులు త్వరితగతిన పూర్తవుతుండగా ఈ రోడ్డు నిర్మాణంలో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడుతుంది. దీంతో ఇరుకుగా మారిన ఈ రహదారిలో ప్రమాదాలు నిత్యకృత్యమై వాహనదారుల ప్రాణాలుగాల్లో కలుస్తున్నాయి. దశాబ్దకాలంగా ఈ రహదారి విషయంలో నేతలు ప్రతిపాదనలు పంపడం మొదలెట్టగా 2017లో హైదరాబాద్-బీజాపూర్ అంతరాష్ట్ర రహదారి 163వ జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. సాధారణ రద్దీ ఉండే మన్నెగూడ నుంచి కర్ణాటక సరిహద్దులోని రావులపల్లి వరకుగల 72 కిలోమీటర్ల మూడు లేన్ల రహదారిని రూ.250 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తి చేశారు. తీవ్రంగా రద్దీ ఉండే మన్నెగూడ నుంచి పోలీస్ అకాడమీ వరకు నిర్మించాల్సిన 46 కిలోమీటర్ల రహదారి పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

ఆరునెలలకు ఒకసారి హడావుడి

2022 మార్చిలో టెండర్ ప్రక్రియ సైతం పూర్తి చేయగా మెగా సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే టెండర్ పూర్తయ్యి రెండేళ్లు గడుస్తుండగా పనులు మాత్రం ప్రారంభం కావటంలేదు. అయితే ఈ హైవే నిర్మాణం కోసం 18 నెలల గడువు ఇచ్చారు. కానీ పనులు ప్రారంభం కాకుండానే గడువు పూర్తయ్యింది. ఈ హైవేతో పాటు రాష్ట్రంలో మంజూరు అయిన హైవేలు అన్ని పూర్తికాగా ఇది ప్రారంభానికే నోచుకోవడం లేదు. దీంతో నిత్యం జిల్లా నలుమూలల నుంచి హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సి వస్తుంది. అయితే సదరు కాంట్రాక్టర్ మిషన్లు తీసుకు వచ్చి రోడ్డు పక్కన పెట్టడం, రోడ్డుకు ఇరువైపుల ఉన్న హోటళ్లు, షాపులు తొలగించాలని ఆరు నెలల కోసారి నోటీసులు ఇవ్వడం లాంటి హడావిడి చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు తప్ప పనులు మాత్రం ప్రారంభించటం లేదు. ఆరు నెలల క్రితం రేవంత్‌రెడ్డి సీఎం కావటంతో ఈ పనులకు మోక్షం లభించే అవకాశం ఉందని జిల్లా వాసులు, అధికారులు సైతం బావించగా ఏ కదలిక లేకపోవటంతో నిరాశకు గురవుతున్నారు.

రక్తమోడుతున్న రహదారి

కర్ణాటక, పరిగి, కొడంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు, వికారాబాద్, తాండూరు మార్గం నుంచి వచ్చే వాహనాలు మన్నెగూడ వద్ద కలుస్తాయి. దీంతో మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు వాహణాల రద్దీ తీవ్రంగా పెరుగుతోంది. దీనికి తోడు ఇటీవల హైదరాబాద్ నుంచి అనంతగిరికి పర్యాటకుల తాకిడి బాగా పెరిగింది. ఒక్కోసారి కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు విసుగెత్తుతున్నారు. విపరీతమైన మలుపులుండడంతో ప్రమాదాల సంఖ్య పెరిగి బాధిత కుటుంబాల్లో తీరని విషాదం మిగిలిస్తోంది. పోలీసుల లెక్కల ప్రకారం సగటున ఏడాదికి ఈ రహదారిలో 200 మంది వరకు మృత్యువాతపడి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇటీవల కర్ణాటక, తాండూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్న సిమెంటు ట్యాంకర్లు, ఎర్రమట్టి లారీలు సైతం అధిక వేగంతో దూసుకు వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వికారాబాద్ నుంచి హైదరాబాద్ వరకు రోడ్డు మార్గంలో చిన్న చిన్న దారుల్లో కూడా లేనంత ఎక్కువ మలుపులు ఉన్నాయి. రహదారి మంజూరై టెండర్లు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు అయినా మలుపులు తగ్గిస్తారా..? లేక ఉన్నదారిలోనే వేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. రోడ్డు మంజూరైందని చర్చలు వచ్చిన ప్రతీ సారి తామే మంజూరు చేయించామని గొప్పలు చెప్పుకొనే బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పనులు ప్రారంభించేందుకు శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

మోతాదుకు మించితే..

పంట దిగుబడిపై ప్రభావం

- గడ్డి మందుతో తగ్గుతున్న భూసారం
- పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు పాటించాలి

దుద్యాల్: ప్రస్తుతం అన్ని రంగాల్లో ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్నా వ్యవసాయం మాత్రం వ్యయ సాయంగా మారింది. రైతులు ఆధునిక పద్ధతుల్లో పంటలను సాగు చేయడంతో పంటలకు రసాయనిక పురుగు మందుల వినియోగం పెరిగిపోతుంది. విత్తనాలు చల్లడం నుంచి పంట కోతకు వచ్చే వరకూ పురుగు మందులను ఏదో ఒక తెగుల్ల సాకుతో వినియోగిస్తూనే ఉన్నారు. రసాయన మందుల వాడకంపై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలి. లేదంటే పంట దిగుబడి దెబ్బతినడంతో పాటు రైతు నష్టాలబారిన పడాల్సి వస్తుందని అధికంగా పురుగు మందులు వాడితే ప్రమాదమని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగిస్తే పంటలపై ప్రభావం పడుతుందని, తప్పకుండా రైతులు వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గాలికి ఎదురుగా రసాయన మందులు పిచికారీ చేయరాదు.
- తెగులు మందు, పురుగు మందు కలిపి పిచికారీ చేయొద్దు.
- చేతులకు గ్లౌజులు, నోటికి, ముక్కుకు మాస్కు వేసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో కళ్లు, ముక్కు, నోరును చేతులతో రుద్దడం, తాకడం వంటివి చేయరాదు.
- వాడిన పురుగు మందు డబ్బాలను ఎక్కడపడితే అక్కడ వేయరాదు.
- రసాయన మందులు పిచికారీ సమయంలో స్ప్రేయర్లకు లీకేజీ ఉండరాదు.
- పిచికారీ సమయంలో బీడీలు, సిగరెట్లు త్రాగరాదు, గుట్కాలు తినరాదు.
- భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రపరుచుకోవాలి.
- రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో కడుపుమంట, దద్దుర్లు వస్తే సమీపంలో ఉన్న వైద్యుడిని సంప్రదించాలి. లేదంటే ప్రమాదం.

సూచనలు పాటించాలి



వ్యవసాయ అధికారులు ప్రతీ గ్రామంలో నిత్యం అందుబాటులో ఉంటారు. వారి సూచనల మేరకు తగిన మోతాదులో పంటలకు ఉదయం వేళల్లో పిచికారీ చేయాలి. ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు ధరించి పిచికారీ చేయాలి. కలుపు మందు కొట్టిన తర్వాత పురుగు మందు కొట్టరాదు. మొక్కల పైభాగంతో పాటు కిందభాగం తడిసిపోయేలా పిచికారి చేస్తే ఆకు కింద ఉన్న రసం పీల్చు పురుగులు నశిస్తాయి. పిచికారీ సమయంలో కడుపుమంట, కల్లు తిరగడం మాదిరిగా ఇబ్బంది అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్



ఆలేడ్‌లో జాగ్రత్తలు పాటిస్తూ పత్తి పంటకు కలుపు మందు పిచికారీ చేస్తున్న రైతు



కల్వకుర్తి బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరాల జల్లు

- బీటీరోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు
- ఆమనగల్లులో రూ.10 కోట్లతో స్కిల్ సెంటర్
- ఆమనగల్లులో కళాశాలల భవన నిర్మాణాలకు నిధులు
- హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణ
- మాడ్గులలో రూ.10 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి వరాలజల్లు కురిపించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినప్పటికీ తాను కల్వకుర్తి బిడ్డనే అన్నారు. కల్వకుర్తి సమీపంలోని కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డితో పాటు తాను కూడా ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ కల్వకుర్తిని అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అన్ని గిరిజన తండాలకు బీటీరోడ్డు నిర్మిస్తామని, ఐదు వంతెనల నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో రూ.10 కోట్లతో స్కిల్‌సెంటర్ ఏర్పాటుతో పాటు అన్ని ప్రభుత్వ కళాశాలల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాడ్గులలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.10 కోట్లు, మాడ్గుల గ్రామ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు, వెల్దండ మండలంలో పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కల్వకుర్తి మండలం తాండ్రలో తాను చదువుకున్న ఉన్నత పాఠశాలను రూ.5 కోట్లతో ఆధునీకరిస్తామన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని త్వరలో నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించనున్నామని సీఎం తెలిపారు. కడ్తాల సమీపంలోని ముచ్చర్ల వద్ద రూ.వందకోట్లతో 50 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఆగస్టు 1న శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

కల్వకుర్తికి ప్రాధాన్యత ఇవ్వండి

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, గుర్రం కేశవులు, రాములు, యాట నర్సింహ, గూడురి శ్రీనివాస్‌రెడ్డి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ మాడ్గుల మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి నాగిలి బహూకరించారు.



షికారు.. ఆపారు!

కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలు వీక్షించేందుకు ఆదివారం జిల్లా వాసులతో పాటు సరిహద్దు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు విచ్చేశారు. బలమైన గాలులు వీయడంతో కాసేపు బోటింగ్ నిలిపేశారు. ఆ సమయంలో యువత నీటిలో కేరింతలు కొట్టారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు. – ధారూరు

ముసురుతో లోటు తీరింది



కాల్వ దాటుతూ పొలాలకు వెళ్తున్న రైతులు

- వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు
- 38శాతం అధిక వర్షపాతం నమోదు
- పంటలకు మేలు చేసిన వానలు

తాండూరు: వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో ఈ నెలలో ఆశాజనకంగా వర్షపాతం నమోదైంది. ఈ ముసురుతో వానాకాలం పంటలకు మేలు చేకూరింది. జిల్లాలోని కుంటలు, చిన్న చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వంద ఎకరాలకు పైగా ఆయకట్టున్న చెరువుల్లోకి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు. కోట్‌పల్లి, జుంటిపల్లి, సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులకు సైతం వరద తాకిడి లేక వెలవెలబోతున్నాయి. తాండూరు కాగ్నా నదిలో సైతం వరద పోటు కనిపించలేదు. జిల్లాలో పక్షం రోజుల క్రితం వరకు అత్యధిక మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదైంది. ముసురు వర్షాలతో సాధారణ వర్షపాతం కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది. జూలైలో కురిసిన వర్షాలకు జిల్లాలో పది మండలాల్లో అత్యధిక వర్షపాతం. ఐదు మండలాల్లో అధిక వర్షపాతం, మరో ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ అధికారులు ధృవీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 271.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఈ మాసంలో కురిసిన వర్షాలకు సాధారణం కంటే 38 శాతం పెరిగి 375.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలో సాగు చేస్తున్న వర్షాధార పంటలకు మేలు చేకూరింది. వాగులు వంకలు పొంగిపొర్లిన దాఖలాలు మాత్రం కనిపించలేదు. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకుని సూర్యుడి జాడ కరువైంది. ఆదివారం కాసేపు ఎండ తగిలినా అది ఎంతో సమయం ఉండలేదు.

వికారాబాద్‌లో అత్యల్ప వర్షపాతం

ఈ నెలలో కురిసిన వర్షాలకు తాండూరు మండలంలో 565.9 మిల్లీమీటలర్ల వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోనే అత్యధిక వర్షపాతం నమోదైన మండలంగా తాండూరు మండలం నిలిచింది. వికారాబాద్ మండలంలో 333.7 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఐదుశాతం తక్కువతో 316.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షపాత వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	నమోదైన వర్షపాతం	సాధారణ వర్షపాతం	వ్యత్యాసం
మర్పల్లి	332.6	265.1	25.0
మోమిన్‌పేట్	392.9	310.3	30.0
నవాబ్‌పేట్	340.3	376.6	23.0
వికారాబాద్	316.5	333.7	5.0
పుడూర్	307.6	297.2	3.0
కుల్కచర్ల	342.7	258.0	33.0
దోమ	343.7	257.7	34.0
బొంరాస్‌పేట్	369.1	207.5	78
ధారూరు	464.4	291.3	58
కోట్‌పల్లి	407.0	291.9	39
బంట్వారం	350.3	287.9	22
పెద్దేముల్	497.2	303.2	54.0
తాండూరు	565.9	312.2	81.0
బషీరాబాద్	452.1	259.7	68.0
యాలాల	471.6	284.8	66.0
కొడంగల్	413.8	265.0	56.0
దౌల్తాబాద్	292.9	263.3	11.0
చౌడాపూర్	286.9	125.0	130.0
దుద్యాల్	261.3	254.0	7.0
	375.2	271.4	38.0

క్లుప్తంగా

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూరు టౌన్: గొర్రెల కాపరులుగా సంచార జీవనం సాగిస్తున్న కురువ కులస్తులకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని తాండూరు కురువ సంఘం నాయకులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కురువ కులస్తులుగా పిలవబడే మదాసి కురువ, మదారి కురువ కులస్తులకు రాష్ట్ర విభజన ముందు వరకు ఎస్సీ కుల సర్టిఫికెట్ ఇచ్చేవారన్నారు. అయితే కురువ కులస్తులను కురుమ అని పిలుస్తూ బీసీ కుల సర్టిఫికెట్‌ను జారీ చేస్తున్నారన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో మాట్లాడి రాష్ట్రంలో 40 లక్షలకు పైగా ఉన్న కురువ కులస్తులకు న్యాయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో తాండూరు కురువ సంఘం ఉపాధ్యక్షుడు పూజారి పాండు, కార్యదర్శి ఇందూరు మల్లేశం, నాయకులు నర్సింలు, వెంకటయ్య, హన్మయ్య, బాలు, రఘు, రాజు, తుల్జప్ప, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



హరిశ్చందర్ (ఫైల్)

కుల్కచర్ల: పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగిలి ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కిచ్చెన్నకుంట తండాకు చెందిన హరిశ్చందర్(40) శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లా డు. అక్కడ ప్రమాదవశాత్తు పంట రక్షణకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే ఆయన మృతి చెందారు. గ్రామస్తులు విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి వివరించారు.

ఎదురెదురుగా వాహనాల ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ధారూరు: ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఎబ్బనూర్ బస్‌స్టేజీ సమీప తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో కార్మికులుగా పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన చింటూ(30), సంజిత్(30), రాహుల్(25)లు కలిసి మండల పరిధిలోని దోర్నాల్ గ్రామంలో జరిగే ఓ ఫంక్షన్‌కు ఒకే బైక్‌పై బయలుదేరారు. ఎబ్బనూర్ బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే తాండూర్ నుంచి హైదరాబాద్‌కు అతివేగంగా వెళుతున్న కారు ఎదురుగా బైక్‌ను బలంగా ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

విద్యుత్ షాక్‌తో పాడి పశువు మృతి



గేదె కళేబరం

కుల్కచర్ల: విద్యుత్ షాక్‌తో పాడి పశువు మృతి చెందింది. ఈ సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చెల్లాపూర్ గ్రామానికి చెందిన కొండ అనంతయ్య రోజులాగే తన పశువులను మేతకు వదిలారు. ఈ క్రమంలో అవి మేతమేస్తూ ముందుకు వెళ్తున్న క్రమంలో ఒకదానికి సమీపంలోని విద్యుత్ స్తంభం ఎర్తు వైరు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. బర్రె విలువ రూ.60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

వర్షాకాలం.. పాముకాటుతో భద్రం

వర్షాకాలంలో పాముకాటు కలవరపెడుతోంది. పంట పొలాల్లో రేయింబవళ్లు చమటోడ్చే రైతులకు ప్రాణ సంకటంగా మారింది. సరైన సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స పొందిన వారు ప్రాణాలతో బయటపడుతున్నారు.

నాటువైద్యంతో ప్రాణాలకు ముప్పు

- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

నవాబుపేట: వర్షాకాలం వచ్చిందంటే పాముల బెడద అధికంగా ఉంటుంది. వానలకు రంధ్రాలు మూసుకుపోయి పాములు బయటకు వస్తాయి. రాత్రి పూట ఇళ్లలోకి ప్రవేశిస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న సమయంలో పాములు రైతులకు ఆటంకం కలిగిస్తాయి. ఏటా పాముల కాటుకు గురై మనుషులతో పాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది.

విష ప్రభావం

కట్ల పాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్త నాళాల్లో కలుస్తుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆస్పత్రిలో చేర్చాలి. నాగు పాములు కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తర్వాత విషం శరీరంలోకి పారుతుంది. అలాగే జెర్రిపోతు, నీరుకట్ట కాటేసిన విషం ఉండదు. అయితే కాటేసిన చోట చికిత్స చేయించడానికి ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

కాటేస్తే లక్షణాలు

వ్యక్తిని విషపూరితమైన పాము కరిస్తే శరీరమంతా నీలం రంగులోకి మారుతుంది. రక్త పోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి నురగ వస్తుంది. ఆయాస పడతారు. శరీరమంతా చెమలు పట్టి కోమాలోకి వెళతారు. గుండె సాధారణ స్థాయి కంటే రెట్టింపుగా కొట్టుకుంటుంది.

ఆందోళన వద్దు

పాము కాటుకు గురైన వ్యక్తులు ఆందోళన చెందొద్దు. ఇది గుండె పోటుకు దారితీస్తుంది. ప్రాథమిక చర్యగా కాటు వేసి ప్రదేశంలో పైభాగంలో కట్టు కట్టాలి. వెంటనే చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి. పాము కాటుకు గురైన వారు ఏ పాము కరిసిందో స్పష్టంగా చెబితే దానికి సంబంధించిన చికిత్స చేస్తారు. ఆస్పత్రుల్లో విరుగుడుగా పాలీవేలెంట్ యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంటాయి. వాటిని తీసుకుంటే ప్రాణ నష్టం ముప్పు ఉండదు.

విష సర్పాల్లో రకాలు

న్యూరోటాక్సిన్ రకం నాగుపాము, కట్లపాము. రెండో రకం హిమోటాక్సిన్ అనగా రక్తపింజర పాము. న్యూరోటాక్సిన్‌తో నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలలో కణజాలం నశించి కాటుబడిన భాగంలో వాపు వస్తుంది. కాటేసింది ఏ పామో తెలుసుకుంటే చికిత్స అందించడం సులభం. కాటేసిన ప్రదేశంలో రెండు కోరలు ఉంటే అది కచ్చితంగా విషపామని నిర్ధారించుకోవాలి. పాము కాటుతో ఉన్న భాగం నుంచి శరీరంలోకి రక్త ప్రసరణతో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

మంత్రగాళ్లను నమ్మొద్దు

పాము కాటుకు శాస్త్రీయ వైద్యం ఉంది. విషంతో ఉన్న సర్పాలు కాటేసినప్పుడు ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నాటు వైద్యులను ఆశ్రయిస్తే వారు తెలిసి తెలియని పరిజ్ఞానంతో చేసే వైద్యంతో బాధితులు ప్రాణాలు కోల్పోతారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఆలస్యం చేశారని ఇతరులపై తోసేస్తారు. విషం లేని పాముకాటుకు గురై వారు ప్రాణాలతో బయటపడినా అది మంత్రగాళ్ల మహిమే అని నమ్ముతారు. ఇదే బాధితుల పాలిట ముప్పుగా మారుతుంది. సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదిస్తే కుట్టిన పామును బట్టి చికిత్స చేస్తారు.

అప్రమత్తంగా ఉండాలి

సాధ్యమైనంత వరకు పాములు, విషకీటకాల బారిన పడకుండా ఉండాలి. రాత్రి పూట పొలాల వద్దకు చేతిలో కర్ర, టార్చిలైటు, తీసుకెళ్లాలి. కప్పలు, ఎలుకలు ఉన్న చోట పాములు ఎక్కువగా సంచరిస్తాయి. ఇంటి ఆవరణలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు, రంధ్రాల్లో నీరు నిండకుండా ఉంచుకోవాలి. ఇళ్లలో ఎలుకలు ఉంటే పాములు వస్తాయి. చిన్నారులను పొదలు, రాళ్లు, చెట్ల వైపునకు వెళ్లకుండా చూడాలి. పాము కాటు సాధారణంగా మోకాలు కింది భాగం వరకు ఉంటుంది. కావునా లుంగి, పంచె, ప్యాంట్ కింది వరకు ధరించాలి.



ఇటీవల ఘటనలు

మండల పరిధిలోని గేటు వనంపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య, మాదారంలో రాములు, కద్చర్ల గ్రామానికి చెందిన రాజులు ఇటీవల పాముకాటుకు గురయ్యారు. దీంతో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం యాంటీ వీనమ్ ఇంజెక్షన్లను తీసుకున్నారు. ప్రాణ నష్టం బారి నుంచి బయటపడ్డారు.

ఆలస్యం చేయొద్దు



పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందొద్దు. ఆస్పత్రిలో పాము కాటుకు పాలీవేలెంట్ యాంటీ వీనమ్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కరిచిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకురావాలి. వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– రోహిత్, మండల వైద్యాధికారి, నవాబుపేట

పాముకాటుకు విద్యార్థి మృతి



తిరుపతి (ఫైల్)

దౌల్తాబాద్: భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓ విద్యార్థిని పాముకాటు రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాదకర సంఘటన దౌల్తాబాద్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇమ్మాపూర్ గ్రామానికి చెందిన మీదింటి తిరుపతి(12) కోస్గీలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. అతడు శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రించిన సమయంలో పాము కాటేసినట్లు గ్రహించాడు. వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన కోస్గీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోనే అతడు మృతి చెందాడు.

తీవ్ర దిగ్భ్రాంతి

తిరుపతి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముక్కుపచ్చలారని చిన్నారిని విషపురుగు కాటేయడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల నగదు అందించారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- రెండు ఇళ్లలో చోరీ
- రూ.30వేల నగదు, డాక్యుమెంట్లు మాయం

నందిగామ: తాళం వేసిన ఇళ్లే టార్గెట్ గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల రాము శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఉద్యోగి. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లాడు. ఆదివారం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తాళం పగులగొట్టిన దుండగులు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలోని మరో ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలోని విలువైన డాక్యుమెంట్లను ఎత్తుకెళ్లారు. రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాతకక్షలతో ద్విచక్ర వాహనాల దహనం

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

అబ్దుల్లాపూర్‌మెట్: పాత కక్షల కారణంగా ఓ యువకుడు కాలనీలోని ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను తన ముగ్గురు స్నేహితులతో కలిసి దహనం చేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీకి చెందిన మొగిళ్ల మహేందర్ అనే యువకుడు కాలనీకి చెందిన పలువురితో గతంలో గొడవ పడ్డాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు తన ముగ్గురు స్నేహితులైన శివ, మరో ఇద్దరు మైనర్ యువకులతో కలిసి శనివారం అర్ధరాత్రి కాలనీలో పార్కింగ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను దహనం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేయగా మహేందర్‌పై అనుమానం ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పాత కక్షల కారణంగానే శివ అనే యువకుడు, మరో ఇద్దరు మైనర్‌లతో కలిసి బైకులకు నిప్పు అంటించినట్లు అంగీకరించాడు. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాద జీవనానికి మొక్కల తోడ్పాటు



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: భావితరాలకు ఆహ్లాదకరమైన జీవన విధానాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డులో జిల్లా అడిషనల్ కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్క బతికేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నీటిని అందించి సంరక్షించాలన్నారు. కాలుష్య పర్యావరణాన్ని నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపిచ్చారు. నేడు నాటిన మొక్కలు రేపు వనంలా మారి వృక్షాలై ముందు తరాలకు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణ, మల్లేష్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, పరశురాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం

అంతకుముందు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ.54 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులకు ఎల్‌ఓసీలను అందజేశారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఎన్నడు లేని విధంగా ప్రతి ఒక్కరికి మంచి వైద్యం అందించాలని సీఎం సహాయనిధి నుంచి కోట్ల రూపాయలను వైద్య ఖర్చులకు ప్రభుత్వం వెచ్చిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

కుల్కచర్ల: విద్యాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యమిస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పీరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతోనే సర్వస్వం సాధ్యమని, గ్రామీణ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, ఎంపీటీసీ ఖరీం, ఎంఈఓ హబీబ్ అహ్మద్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు రాజు, భరత్‌కుమార్, ఆంజనేయులు, గోపాల్‌నాయక్, జంగయ్య, కుమ్మరిస్వామి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్

చేవెళ్ల: ముదిరాజుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు నగరంలో చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన్ను సన్మానించిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శివరాజ్, నాయకులు గణేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, మల్లేశ్, భిక్షపతి తదితరులున్నారు.

తెగిపడిన విద్యుత్ తీగతో గేదె మృతి



గేదె కళేబరం

తుర్కయంజాల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి గేదె మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌లోని సాయినాథ్ కాలనీలో నివాసం ఉండే పాలరాజు స్థానికంగా ఓ హోటల్ యజమాన్యానికి చెందిన భూమిలోకి గేదెలను మోపడానికి తీసుకెళ్లారు. అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు ఓ గేదె తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో అప్రమత్తమైన రాజు మిగతా గేదెలను పక్కకు కొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను సరిచేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గేదె మృతి చెందిందని బాధితుడు ఆరోపించారు. తనకు రూ.లక్ష యాభై వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



జింకకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: కుక్కల దాడిలో జింకకు తీవ్ర గాయాలైన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. యాచారం మండలం నందివనపర్తికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బావి వద్ద వీధి కుక్కలు ఓ జింకపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింకను స్థానికంగా ఉన్న విజయ్‌కుమార్ గమనించి పశువుల ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. అనంతరం ఫారెస్టు అధికారుల సూచన మేరకు జింకను నగరంలోని జూపార్కుకు తరలించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

తలకొండపల్లి: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జూపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం .. కేశంపేట మండలం కాకనూర్‌కు చెందిన ఒడ్ల బ్రహ్మచారి(57) పని నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో జూలపల్లి శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతరు శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మొరంగపల్లి–ఎన్కేపల్లికి వెళ్లే రోడ్డు దుస్థితి

మరమ్మతులు మరిచి.. వెతలు మిగిల్చి

మోమిన్‌పేట: పదేళ్లుగా మరమ్మతులు చేపట్టక మండలంలో రోడ్లన్నీ పూర్తిగా ఛిద్రమయ్యాయి. వర్షాలు కురిస్తే గుంతలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఎన్కేపల్లి, దుర్గంచెర్వు పంచాయతీ రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. పదేళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్లు పూర్తిగా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు ఉన్నా కనీసం మరమ్మతులు చేయలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఏనిమిది నెలలు గడుస్తున్నా ఈ రోడ్లల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎన్కేపల్లి వరకు ఉన్న రెండు కిలోమీటర్ల మేర బీటీ రహదారి అడుగుకో గుంతగా మారిందని గ్రామస్తులు వాపోతున్నా రు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నాతాధికారులు స్పందించి వెంటనే నూతన రోడ్డును నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధులు లేక.. పాలన సాగక!

- గాడి తప్పిన పంచాయతీల పాలన
- కార్యదర్శులపై పెరిగిన పని ఒత్తిడి

షాబాద్: పంచాయతీ పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేక ఎన్నో పనులకు ఆటంకాలు కలుగుతున్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతుంది. ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు, పాలకవర్గాలకు జీపీల బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునే వారు. వారి పదవీ కాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జీపీలకు నిధులు రాక పోవడంతో కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చులు చేస్తున్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర పనులకు కార్యదర్శులే సొంతంగా వెచ్చిస్తున్నారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నారు. నిధులు విడుదలలో జాప్యం జరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు.

పేరుకే ప్రత్యేకాధికారులు

పాలక వర్గాల పదవీ కాలం పూర్తయిన తర్వాత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వీరు అప్పటికే వారి బాధ్యతల్లో తీరిక లేకుండా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొకరికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఉన్నాయి. దీంతో వారు జీపీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒక్కసారి కూడా గ్రామాలకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శులే ముఖ్యమైన పనులు, సంతకాల కోసం ప్రత్యేకాధికారుల వద్దకు వెళ్తున్నారు.



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

వేతనాలు ఇవ్వలేని దుస్థితి

జిల్లాలోని 558 గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగు సార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా రావడం లేదు. నిధులు సకాలంలో రాకపోవడంతో అప్పటి పాలకవర్గాల సభ్యులు జేబులో నుంచి ఖర్చు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణకు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉన్నా.. చాలా గ్రామాలకు ఇవి సరిపోవడం లేదు. దీంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పంచాయతీలలో ట్రాక్టర్లు నిర్వహణ కష్టంగా మారింది.